


సీఆర్టీల రెన్యువల్స్‌పై పీవో హామీ: యూటీఎఫ్

పార్వతీపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో సీఆర్టీల రెన్యువల్స్‌పై నూతన పీవో మాధవన్ హామీ ఇచ్చినట్లు యూటీఎఫ్ వెల్లడించింది. సంబంధిత అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవో హామీ మేరకు తాత్కాలికంగా పోరాటాన్ని వాయిదా వేస్తున్నామన్నారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్, కోర్టు ఉత్తర్వులు, గతేడాది ఆర్డర్ కాపీలను పీవోకు చూపించామన్నారు. 130 ఖాళీలు ఉన్నాయని, టీచర్లు లేక స్కూల్స్ మూతపడుతున్నాయని వారు తెలిపారు.

ప్రాజెక్టులకు మహర్దశ

- దృష్టి సారించిన కూటమి సర్కారు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో అధికారుల్లో కదలిక
- శివారు ఆయకట్టుకూ నీరు అందించేలా చర్యలు
- ఇప్పటికే కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు



పెద్దగెడ్డ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తికావడంతో ప్రవహిస్తున్న సాగునీరు

పార్వతీపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ సర్కారు పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై టీడీపీ కూటమి సర్కారు దృష్టి సారించింది. కాలువల అభివృద్ధిపై ఆదేశాలు జారీ చేసింది. శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. దీంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టులు, కాలువల నిర్వహణపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే.. జిల్లాలో వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, పెదంకలం, ఒటిగెడ్డ ప్రాజెక్టుల పరిధిలోని జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో శివారు ఆయకట్టుకు నీరు చేరే అవకాశం ఉంది. దీంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటలకు ఎటువంటి ఢోకా ఉండదని వారు చెబుతున్నారు. ఏదేమైనా టీడీపీ కూటమి సర్కారు చొరవతో సాగునీటి కాలువలు, జలాశయాల ఆధునికీకరణ పనులకు మోక్షం లభించిందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

గత వైసీపీ సర్కారు హయాంలో..

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఏ మాత్రం పట్టించుకోలేదు. జలాశయాల నిర్వహణ, మరమ్మతులకు పైసా కూడా మంజూరు చేయలేదు. ఆధునికీకరణ పనులను కూడా పూర్తిచేయించలేకపోయింది. జైకా నిధులను దారి మళ్లించడమే కాకుండా.. ప్రాజెక్టుల వద్ద చేపట్టిన 20 శాతం పనులకు బిల్లులు చెల్లించలేదు.. మరోవైపు సాగునీటి కాలువల పైనా దృష్టి సారించలేదు. కనీసం పూడికలు కూడా తీయించలేదు. దీంతో ఏటా అన్నదాతలు సాగునీటికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల రైతులే శ్రమదానంతో కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించిన సందర్భాలున్నాయి. ప్రధానంగా శివారు భూములకు నీరందకపోవడంతో ఆయకట్టుదారులు నానా అవస్థలు పడ్డారు. మొత్తంగా ఐదేళ్లు వరుణుడిపైనే ఆధారపడి పంటల సాగు చేపట్టారు.

రైతు సమస్యలపై దృష్టి..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా రైతుల సమస్యలపై దృష్టి సారించింది. సాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు పనులు ప్రారంభించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. సాగునీటి కాలువల అభివృద్ధి, జలాశయాల ఆధునికీకరణపై సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. నూతన ప్రభుత్వం జిల్లా ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంపై మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వీఆర్ఎస్ నుంచి నీరు విడుదల..

మక్కువ: శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ జలాశయం నుంచి బుధవారం నీరు విడుదల చేయనున్నారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాల్లో ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించ నున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీ నాయన, బోనెల విజయచంద్ర, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొనున్నారు.

శివారు భూములకూ నీరు..

జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా శివారు భూములకూ పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం.. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో జలాశయాల పరిస్థితిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఆదేశాలతో ఇరిగేషన్‌శాఖ ద్వారా కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు రైతులకు తీవ్ర అన్యాయం చేసింది. ప్రాజెక్టుల ఆధునికీకరణకు జైకా నిధులను వినియోగించకుండా దారి మళ్లించింది. ఐదేళ్ల పాటు ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేసింది.

-గుమ్మిడి సంధ్యారాణి,
స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

జావలా బిర్యాని..

ఒక ముక్క చికెన్!

- ఇదీ కురుపాం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మెనూ..
- మండిపడిన విద్యార్థినుల తల్లిదండ్రులు

కురుపాం,జూలై 30: కురుపాం ఏపీ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడంపై తల్లిదండ్రులు మండిపడ్డారు. ఇదేం మెనూ? అంటూ ప్రశ్నించారు. ఆదివారం వారు ఆ పాఠశాలకు వెళ్లి మెనూను పరిశీలించారు. జావలా బిర్యాని ఉండగా.. ఒక్కో విద్యార్థినికి ఓ చికెన్ ముక్క వడ్డించడాన్ని గమనించారు. దీనిపై ఆవేదన చెందిన వారు మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ సత్యవతిని కలిసి పై విషయాన్ని తెలిపారు. తాము స్వయంగా మెనూ పరిశీలించామని.. 570 మంది విద్యార్థినులకు 35 కేజీల బిర్యాని ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఆ బిర్యాని కూడా జావలా ఉందని, చికెన్ పూర్తిస్థాయిలో పెట్టడం లేదని తెలిపారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఇదిలా ఉండగా.. రాత్రి వేళల్లో పాఠశాల ప్రహరీ చుట్టూ కొందరు వ్యక్తులు తిరుగుతున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రిన్సిపాల్ సత్యవతి మాట్లాడుతూ.. ఆదివారం తాను లేని సమయంలో అలా భోజనం పెట్టి ఉండొచ్చన్నారు. ఇకపై అలా జరగకుండా చూస్తానని చెప్పారు. అనంతరం వంట వారిని పిలిచి మందలించారు. రాత్రి పూట పాఠశాల ప్రహరీ చుట్టూ ఒక వ్యక్తి తిరగడం వాస్తవమేనని తెలిపారు. అయితే సీసీ కెమెరాలో క్లారిటీగా కనిపించడం లేదని చెప్పారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేస్తామన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం



సగంలోనే వదిలేశారు..

- రేగులగూడ బ్రిడ్జి నిర్మాణానికి బ్రేక్
- ఏడాది గడుస్తున్నా సాగని పనులు
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- సకాలంలో బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం
- గిరిజన గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట, జూలై 30: గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. అధికారుల మధ్య సమన్వయం లోపం కారణంగా.. సీతంపేట మండలం పులిపుట్టి పంచాయతీ పంచాయతీ పరిధిలో రేగులగూడ బ్రిడ్జి నిర్మాణానికి బ్రేక్ పడింది. అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. సుమారు ఏడాది గడుస్తున్నా.. నిర్మాణం కొలిక్కి రాలేదు. దీంతో పలు గిరిజన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా రేగులగూడ- ఎంపలగూడ గ్రామాలకు రహదారి సౌకర్యంతో పాటు గెడ్డవాగు దాటడానికి వీలుగా ఉపాధిహామీ పథకం కింద రూ. రెండు కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర కిందట గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేమని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆర్అండ్‌బీ శాఖాధికారులకు ఆ బాధ్యతలు అప్పగించారు. ఒప్పందం మేరకు ఎం బుక్ రికార్డు నిర్వహణను ఆర్అండ్‌బీ సిబ్బంది చూసుకున్నారు. గిరిజిన ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. మరోవైపు గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా దీనిపై అధికారులు దృష్టిసారించలేదు. దీంతో గిరిజన గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద పోటెత్తుతుండడంతో వారు గెడ్డవాగు దాటలేని పరిస్థితి ఏర్పడింది. ఆరు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి ఎంపలగూడ గ్రామానికి చేరుకోవాల్సి వస్తోంది. కొత్తూరు, సీతంపేట వైపు రావాలన్నా.. ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం ఆయా ప్రాంత రైతులు పంట పొలాలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గెడ్డవాగు దాటలేక రేగులగూడ-ఎంపలగూడ గ్రామాల విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయంపై గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలంను వివరణ కోరాగా.. బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విధులపై నిర్లక్ష్యం వద్దు: డీఈవో

మక్కువ, జూలై 30: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఆదేశించారు. విధి నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కాశీపట్నం కేజీబీవీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన బోధన అందించి.. వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాల ప్రత్యేక అధికారి జి.నాగదుర్గ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం

- ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పార్వతీపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులకు పరిహారం అందించ నున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసుల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందించ నున్నట్టు చెప్పారు. వాహనం గుర్తిస్తే ఇన్సూరెన్స్ కూడా క్లయిమ్ చేసుకో వచ్చన్నారు. జిల్లాలో నమోదైన 13 హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులను ఆగస్టు 2న కలెక్టరేట్‌కు తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే శుక్రవారం సాయంత్రం ఐదు గంటల్లోగా కలెక్టర్ కార్యాలయానికి రావాలన్నారు. లేకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కె.హేమలత, సీఐ కృష్ణారావు, ఎస్ఐ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పింఛన్ల పంపిణీకి సన్నద్ధం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి

పార్వతీపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సం దర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆగస్టు-1న ఉదయం ఆరు గంటల నుంచి ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధమ చేశామని తెలిపారు. ఈ మేరకు అధికారులు, సిబ్బందికి తగు సూచనలు అందించామన్నారు. జిల్లాలో 1,43,398 పింఛన్లు ఉన్నాయని, వాటికి సంబంధించి రూ.59.58 కోట్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు. కదలలేక మంచానికే పరిమితమైన వారికి మొదటగా పింఛన్ల సొమ్ము అందిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయిస్తున్నామని, సచివాలయ సిబ్బంది, వెలుగు ఏపీఎంలు, సీసీలు తదితరులను ఇందులో భాగస్వాములుగా చేస్తున్నామని తెలిపారు. జిల్లా అధికారులను మండల ప్రత్యేక అధికారులుగా నియ మించామన్నారు. మొదటి రోజునే శతశాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అనివార్య కారణాల వల్ల లబ్ధిదారులెవరైనా అందుబాటులో లేకుంటే.. రెండో రోజు అందిస్తామన్నారు.



పార్వతీపురంలో నాబార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

పర్యవేక్షణ చేయాలి...

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని, ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సిబ్బంది మ్యాపింగ్ ఇప్పటికే పూర్తయిందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వైసత్యంనాయుడు, కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు కార్యాలయం ప్రారంభం..

పార్వతీపురంలోని ఎస్ఎన్‌పీ కాలనీలో నాబార్డు కార్యాలయాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. నీతి ఆయోగ్ పార్వతీపురం మన్యాన్ని ఆశావహ జిల్లాగా గుర్తించిందని, బ్యాంకర్ల మద్దతుతో సాధ్యమైన అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించొచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో భిన్నమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లా అన్ని రంగాల్లో రాణించి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఇందులో నాబార్డు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. కాగా నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారిగా దినేష్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏపీ రీజియన్ సీజీఎం ఎం.ఆర్.గోపాల్, శ్రీకాకుళం డీసీసీబీ సీఈవో వర ప్రసాద్, ఏపీజీవీబీ ఆర్ఎం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పండగలా ఆదివాసీ దినోత్సవం

- ఏర్పాట్లు పూర్తి చేయాలని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోల ఆదేశం

పార్వతీపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి)/సీతంపేట, జూలై 30: ఐటీడీఏల ఆధ్వర్యంలో ఆగస్టు 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవాన్ని పండగలా జరపాలని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం సీతంపేట ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఆదివాసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీలంతా ఆ రోజు వచ్చి సంబరాల్లో పాల్గొనాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి, ఇన్‌చార్జి ఏపీవో వెంకట గణేష్, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేజేశ్వరరావు, ఆదివాసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో కూడా సంబంధిత అధికారులతో పీవో మాధవన్ సమీక్షించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. కమిటీలకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు సిద్ధం చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎ.మురళీధర్, ఏఏవో ప్రసాద్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, డీపీవో బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారి శాంతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీడీవీకేలను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస్ కేంద్రాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం దిబ్బగూడ, పెదరామ, సీతంపేటలో వీడీవీకేలను పరిశీలించారు. స్థానిక వనరులను వినియోగించుకొని ఆర్థిక అభివృద్ధి పెంపొందించుకోవడానికి వీలుగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెలుగు సిబ్బంది వీడీవీకే సభ్యులకు అవసరమైన ప్రోత్సాహం అందించాలన్నారు.





సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల్లో అధికారులతో సమీక్షిస్తున్న పీవోలు

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం.... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?

నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

"హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది."

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

నవ్య | చిత్రజ్యోతి

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లూ నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపో ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రదానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరఫున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేద'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరపున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను



విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతి నాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.

ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్కరోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

"సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి."

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జీడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.
- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐవీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

"కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను."

వాయు కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక

● విజయనగరంలో 3 నెలల్లో 30 వేలు మొక్కలు నాటాలి ● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 30: విజయనగరంలో వాయుకాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమంపై మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వాయుకాలుష్యం ఎక్కువ ఉందని, దానిని తగ్గించేందుకు వివిధ శాఖల సమన్వయంతో పటిష్ఠమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమంపై జిల్లా పొల్యూషన్ ఇంజినీర్ సరిత మాట్లాడుతూ దేశంలో వాయు కాలుష్య నియంత్రణ కు కేంద్ర ప్రభుత్వం 2021లో కార్యక్రమం రూపొందించిందని, దేశ వ్యాప్తంగా వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న 131 నగరాల్లో విజయనగరం కూడా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వాయుకాలుష్య నియంత్రణకు సుమారు రూ. 2.66 కోట్ల అంచనా వ్యయంతో వార్షిక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. గాలిలో దుమ్ము, ధూళి కణాల నియంత్రణకు వచ్చే మూడు నెలల్లో పట్టణంలోని 70 కిలోమీటర్ల పొడవు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సుమారు 30 వేలు మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలన్నారు. వాహన కాలుష్యాన్ని నియంత్రించాలని, దీని కోసం విస్తృతంగా, వాహనాలను తనిఖీ చేసి, జరిమానా విధించాలని ఆదేశించారు. కాలుష్య తనిఖీ యంత్రాల సంఖ్య పెంచాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలని, దీనిపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

నిర్వహించాలని సూచించారు. దీని కోసం బ్యాటరీ చార్జింగ్ పాయింట్లను ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని మహిళా సంఘాలచేత విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు, కాలుష్య తనిఖీ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవన నిర్మాణం జరిగేటప్పుడు వాయుకాలుష్యం పెరగకుండా భవన యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో విజయనగరం మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని, పరిశ్రమలు శాఖ డీడీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పైడిమాంబకు సారె

● ఘటాలతో భారీ ఊరేగింపు

విజయనగరం రూరల్, జూలై 30: సింహశైల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పైడిమాంబకు సారెని సమర్పించారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, కాయగూరలను సమర్పించారు. కోట వద్ద నుంచి మహిళా భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు ముందు పులివేషాలు సందడి చేశాయి. థాసా డప్పులు ఉర్రూతలూగించాయి. కోట వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. అనంతరం పైడిమాంబ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు అవనాపు విజయ్, భార్గవి దంపతులతో పాటు, నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు.





అమ్మవారికి సమర్పించిన సారె, ఘటాలతో భక్తులు

మరోవైపు అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు మంగళవారం కావడంతో పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు.

వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కలెక్టరేట్: జిల్లాలోని విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న వసతి గృహాల్లో సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ అధికారి కె.సందీప్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 38 వసతి గృహాల్లో 3800 విద్యార్థులకు ప్రవేశాలు ఉన్నాయని, కానీ 2092 మంది ఉన్నారని, మిగిలిన సీట్లకు ఆగస్టు 31 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సందీప్

సీబీఎస్ఈ విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ

శృంగవరపుకోట రూరల్: సీబీఎస్ఈ విధానంపై జిల్లాలోని 63 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 50 సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఒకరోజు వృత్యంతర శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. రిసోర్స్ పర్సన్‌గా విద్యాలయం ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేశవ ప్రసాద్, కోరుకొండ సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు వ్యవహరించారు.

● ఎస్.కోట మానవవనరుల కేంద్రంలో ఉన్న భవితకేంద్రం, పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలను డీఈవో ప్రేమ్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. మండల విద్యాశాఖాధికారులు నరసింగరావు, పాదం లక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

8న షుగర్ కేన్ సొసైటీ ఎన్నికలు

బొబ్బిలి: బొబ్బిలి షుగర్ కేన్ గ్రోయర్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి వచ్చేనెల 8న స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. స్థానిక సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారి, గజపతినగరం సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.సత్యనారాయణ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 1 న సబ్ డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. 2 న నామినేషన్లను పరిశీలిస్తారు. 3న ఉపసంహరణకు గడువు. అదే రోజు సాయంత్రం ఐదు గంటల తరువాత ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. ఎన్నిక అనివార్యమైన పక్షంలో ఆగస్టు 8న ఎన్‌జీవో హోమ్‌లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది. తొమ్మిది మంది డైరెక్టర్లకు ఎన్నిక నిర్వహిస్తారు. వారిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ముగ్గురిని ఎన్నుకుంటారు. బొబ్బిలి, పార్వతీపురం మన్యం ప్రాంతాలలోని మొత్తం 17 మండలాలకు చెందిన 105 మంది చెరకు ఉత్పత్తిదారులు మాత్రమే ఓటు హక్కును కలిగి ఉన్నారని ఎన్నికల అధికారి సత్యనారాయణ, ఎస్‌డీసీవో జ్యోతి తెలిపారు.




నోటిఫికేషన్ విడుదల చేస్తున్న సహకారశాఖాధికారులు

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో పాడైన రోడ్ల మరమ్మతుల కోసం అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టరుకు పంపినట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గొల్లపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్ వరకు రూ.2.25 కోట్లు, జయప్రకాశ్ పాఠశాల రోడ్డుకు రూ.35 లక్షలతో ప్రతిపాదనలు చేశామన్నారు. తాండ్రపాపారాయ జంక్షన్‌ను ఆకర్షణీయంగా రూపొందించేందుకు రూ.10లక్షలతో అంచనాలు తయారు చేశామన్నారు. పట్టణంలో పన్నుల బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల మున్సిపల్ షాపుల మరమ్మతులు చేపడతామన్నారు. బీపీఎస్ నిధులు రూ.42 లక్షలతో నిర్దేశించిన పనులు చేపడతామని తెలిపారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు.

కలెక్టర్, ఎస్పీతో బేబీనాయన భేటీ

బొబ్బిలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్, ఎస్పీ జిందాల్‌ను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం వేర్వేరుగా కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులకు మొక్కలను బహూకరించారు. గ్లోబల్ టైగర్స్ డే కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి మంగళగిరిలో పాల్గొన్న కార్యక్రమాల అనుభవాలను కలెక్టరుతో, ఎస్పీతో పాలుపంచుకున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం సహకారం అందివ్వాలని బేబీనాయన కోరారు. నాలుగు మండలాలకు సంబంధించిన స్థితిగతులను కలెక్టరుకు, ఎస్పికి ఎమ్మెల్యే వివరించారు.



ఎస్పీకి బొకే అందిస్తున్న బేబీనాయన

మానవ అక్రమ రవాణా హేయమైన చర్య

విజయనగరం (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా హేయమైన చర్యని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణా అత్యంత హేయమైన చర్యని, ఇటువంటి వాటికి పాల్పడితే, కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, సీడబ్ల్యూసీ చైర్మన్ హిమబిందు, సాయి విజయలక్ష్మి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి విజయకల్యాణి

ఎరుకులపాకలు పాఠశాల తనిఖీ

బాడంగి, జూలై 30: మండలంలోని ఎరుకులపాకలు స్కూల్ ఎత్తివేసేందుకు తప్పుడు నివేదికలు ఇచ్చారని సోమవారం జేసీ గ్రీవెన్స్‌కు గజరాయనివలస టీడీపీ ఎంపీటీసీ పాలవలస గౌరి ఇచ్చిన ఫిర్యాదు తో సంబంధిత అధికారులు స్పందించారు. ఎంఈవోలు రాజేశ్వరి, లక్ష్మణదొర హుటాహుటిన లక్ష్మీపురం మధుర గ్రామమైన ఎరుకులపాకల స్కూల్‌కు వెళ్లి పరిశీలించారు. 3, 4, 5 తరగతులను గజరాయనివలసలో ఉన్న యుపి స్కూల్‌కు తరలిస్తూ గత వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. దీనికి సమర్థిస్తూ ఇక్కడ పనిచేసిన ఎంఈవోలు ఇద్దరు వంతపలకడంతో వీరిపై విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు, జేసీకి ఎంపీటీసీ పాలవలస గౌరు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులు మేరకు అధికారులు మంగళవారం హుటాహుటిన పరుగులు తీస్తూ అక్కడికి చేరుకొని గజరాయనివలస యుపి స్కూల్‌కు, ఎరుకులపాకలు ప్రాథమిక పాఠశాలకు మధ్య దూరాన్ని పరిశీలించారు. ఎంఈవోలతోపాటు ఎంపీటీసీ పాలవలస గౌరి పాల్గొన్నారు.



పాఠశాలలో ఎంపీటీసీ పాలవలస గౌరితో మాట్లాడుతున్న ఎంఈవోలు

వైసీపీని వీడిన జాకేరు సర్పంచ్

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, బుద్ధ అప్పలనాయుడు తన అనుచరులతో వైసీపీకి గుడ్‌బై చెప్పారు. మంగళవారం ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అనుచరులతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్టు సర్పంచ్ భర్త అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీల కన్నా తమకు గ్రామాభివృద్ధే ధ్యేయమని చెప్పారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమవుతున్నట్టు తెలిపారు. ఏ పార్టీలో చేరుతున్నదీ మరో రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ వారాది అప్పలనాయుడు, వార్డు సభ్యులు కలవలపల్లి శ్రీనివాసరావు, కోలా రమణమ్మ, సలాది సత్యవతి, మిరియాల ముత్యాలమ్మ, జుత్తుక నాగేష్, సుంకరి రామసత్యం, బుద్ధ హైమావతి, పాల సంఘ అధ్యక్షుడు కర్రి నరసింహమూర్తి, పాఠశాల కమిటీ చైర్మన్ కోలా వీరన్న నాగమణి, బుద్ధ గోవింద, గణేష్, నెక్కల ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాకేరు సర్పంచ్, పంచాయతీ పాలక మండలి సభ్యులు

సమస్యల పరిష్కారానికి పోరుబాట

రాజాం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరుబాట సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణమూర్తి తెలిపారు. మంగళవారం రాజాం పట్టణంలోని కళావేదికలో సీపీఐ నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికిందని విమర్శించారు. అధికారంలోకి రాకపోయినా ఇండియా కూటమి బలం పుంజుకుని పార్లమెంట్‌లో మంచి ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందన్నారు. బీజేపీ మతోన్మాద చర్యలను, కార్పొరేట్ శక్తులకు వ్యవస్థలను కారు చౌకగా కట్టబెట్టే విధానాలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా సీపీఐ పార్టీ పూర్వ కార్యదర్శి చాపర సుందరలాల్, జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, బుగత అశోక్, సింగారపు కనకరాజు, గంగరాజు, యండమూరి కృష్ణ, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి ఎయిర్‌పోర్టును పునరుద్ధరించాలి

బాడంగి: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఢిల్లీలోని పౌర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు బాడంగి విమానాశ్రయంపై మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బ్రిటీష్ వారి కాలంలో 200 ఎకరాల్లో నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రస్తుతం మరుగునపడింది. దీనిని వినియోగంలోకి తీసుకువస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వివరించారు.

కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి నగర పాలక సంస్థ అధికారులు సన్నద్ధమయ్యారు. మంగళవారం నగర పాలక సంస్థ అధికారులు కాలువ పరిస్థితిని సమీక్షించారు. అక్కడ కాలువ స్థితిగతులు, పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడిక, వర్షం నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ గంట స్తంభం సమీపంలో ఉన్న ప్రధాన కాలువతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన ప్రధాన కాలువ సమస్య పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఇందుకు చేపట్టాల్సిన నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత మేరకు నిధులు అవసరమవుతాయో ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. రెండు కాలువల్లో యంత్రాలతో పూడికను తొలగించడం, శాశ్వత ప్రాతిపదికన నెట్‌లను నిర్మించడం ద్వారా వర్షం నీరు సజావుగా పెద్ద చెరువులోకి తరలిపోయే విధంగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, అంజిబాబు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి

విజయనగరం రింగురోడ్డు: రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ వసూళ్ల పనితీరు-పురోగతిపై చర్చించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ మిగిలి ఉన్న అన్ని బకాయిలను వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఆస్తి పన్ను విధింపు విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వినోద్, సాయికిరణ్ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం

విజయనగరం రింగురోడ్డు: చేతుల పరిశుభ్రతతో రోగాలు దూరం అవుతాయని ఆర్‌బీఎస్‌కే పీఏ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం రింగురోడ్డులోని పీఎస్సార్ స్కూల్‌లో సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమగ్ర శిక్షా, డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేతులు పరిశుభ్రత ద్వారా 80 శాతం వ్యాధులు నియంత్రించవచ్చునన్నారు. అనంతరం ఎంఈవో సత్యవతి చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. డీబీఎస్ఐ ప్రతినిధులు టి.లక్ష్మి, భగవాన్‌దాస్, శంకరరావు, వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలి

శృంగవరపుకోట రూరల్: జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లోనూ, త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తాచాటి జిల్లాకు మరింత పేరుతేవాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం బొడ్డవరలోని తన నివాసంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోపాడ జాన్సన్, భరణికాని హారిక, మోహ్మద్ ఖలీల్‌ఉల్లా, ఆదిలక్ష్మి, పంపాన మౌనికలను ఆయన అభినందించారు.

బోధనలో నూతనత్వం ఉండాలి

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు చేసే బోధనలో నూతనత్వం ప్రదర్శించాలని మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల పఠనాశక్తిని పరిశీలించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

జామి: పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా అన్నారు. మంగళవారం ఉదయం మండల కేంద్రమైన జామి మేజర్ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో పలు వీధులు సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు.

నిమ్మలపాలెంలో దోమలమందు పిచికారీ

కొత్తవలస: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు మంగళవారం నిమ్మలపాలెం గ్రామంలో దోమల నివారణకు ఎబెట్ ద్రావణాన్ని స్ప్రే చేశారు. డెంగీ, మలేరియా వంటి వాటికి ప్రధాన కారణమైన దోమల నివారణకు ఎబెట్ మందు స్ప్రే పరిష్కారమని వియ్యంపేట వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. గ్రామ సర్పంచ్ కొట్యాడ నిర్మల సాయి, కార్యదర్శి అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

3న రేగిడి మండల సర్వసభ్య సమావేశం

రేగిడి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆగస్టు 3న ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్యామలా కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి అన్నిశాఖల ఉన్నతాధికారులు పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని, గౌరవసభ్యులు సమావేశానికి హాజరై, గ్రామాల్లో ఉన్న సమస్యలు సభ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో కోరారు.

నేడు బూరాడ సచివాలయం ప్రారంభం

రేగిడి: బూరాడలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి మంగళవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరవ్వాలని ఆమె కోరారు.

ఎనర్జీ అసిస్టెంట్ పోస్టు భర్తీపై ఎస్ఈకి ఫిర్యాదు

రేగిడి: మండలంలో సంకిలి సచివాలయానికి రెగ్యులర్ ఎనర్జీ అసిస్టెంట్ పోస్టు భర్తీ విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులపై ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈకి అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో ఎంపీడీవో గ్రీవెన్స్‌కు ఫిర్యాదుచేయగా, సంబంధిత ఎలక్ట్రికల్ ఏఈకి ప్రత్యేక లేఖ రాసినా స్పందించలేదని అప్పాపురం సర్పంచ్ వెల్లడించారు.

డ్వాక్రా సంఘాలను అభివృద్ధి చేయాలి

రేగిడి: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే కోండ్రు మురళీ ఆధ్వర్యంలో మండలంలో డ్వాక్రా సంఘాలను మరింత అభివృద్ధి చేయాలని, మహిళలకు అండగా నిలవాలని మండల వీఓఏ(సీఏఫ్)ల యునియన్ నేతలు కోరారు. డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్, రేగిడి మండల టీడీపీనేత దూబ ధర్మారావును మంగళవారం వీరంతా మర్యాదపూర్వకంగా కలిశారు. స్వగ్రామం కాగితాపల్లిలో దూబతో పాటు మండల టీడీపీనేత గురువాన ధనంజయ్‌ను కలిసి టీడీపీ ప్రభుత్వ ఏర్పాటుపై అభినందనలు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

కలెక్టరేట్: ఏపీఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెవెన్యూ శాఖలో డీటీల బదిలీ

కలెక్టరేట్: రెవెన్యూ శాఖలో ఎన్నికల ముందు డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన డిప్యూటీ తహసీల్దార్లను తిరిగి యథాస్థానానికి మార్పు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకరిద్దరు మినహా మిగిలిన వారికి పాత స్థానాలు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

పారిశుధ్య పనుల పరిశీలన

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు పర్యవేక్షించారు. మంగళవారం దాసన్నపేట, అశోక్‌నగర్, కంటోన్మెంట్, బొగ్గుల దిబ్బ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు సాలెం రాజు సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహంలో సీట్ల భర్తీకి చర్యలు

బొబ్బిలి: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్‌డబ్ల్యూవో నిడగంటి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 10 వతరగతి వరకు మొత్తం 61 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 39 మంది ఉన్నారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు తమను సంప్రదించాలన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



పైడిరాజు (ఫైల్)

సీతానగరం, జూలై 30: మండలంలోని అంటిపేట గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో అరసాడ పైడిరాజు (25) మృతి చెందగా, మరో ఇరువురికి గాయాలయ్యాయి. మంగళవారం పోలీసులు అందించిన వివరాల ప్రకారం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన సీహెచ్ చిన్నారావుతో పాటు మరో ఐదుగురు చినభోగిలి వెళ్లేందుకు ఆటోలో బయ లుదేరారు. అంటిపేట గ్రామ సమీపంలో ఓ మలుపు వద్ద ఆటో వేగాన్ని నియంత్రించే సమయంలో సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. పక్కనే ఉన్న పొలంలోకి మూడు పల్టీలు కొట్టడంతో పైడిరాజు పైన ఆటో పడింది. క్షతగాత్రులను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పైడిరాజు, చిన్నా రావు, శంకరరావులను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు రిఫర్ చేశారు. మార్గమధ్యంలో పైడిరాజు మృతి చెందాడు. క్షతగాత్రులు అందరిదీ లచ్చయ్యపేట గ్రామానికి చెందిన వారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పాలకొండ: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక రాయుడుకోనేరులో దిగి ఆత్మహత్యకు పాల్పడగా స్థానికులు గుర్తించి ఆమెను ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి తరలిస్తూ ఇద్దరు అరెస్టు

భామిని: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేసినట్టు పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి, మంగళవారం కొత్తూరులో కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. ఒడిశా నుంచి ప్రైవేటు బస్సులో 11 కేజీలు గంజాయి తరలిస్తుండగా ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేయగా వారిని అరెస్టు చేశామన్నారు. కాగా బత్తిలిలో 48 గంటల పాటు ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

అదుపు తప్పిన బైక్

ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం ● భీమిలి బీచ్‌రోడ్డులో ఘటన



భీమునిపట్నం, జూలై 30: బైక్ అదుపుతప్పి, బోల్తా పడడంతో ఇంజనీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థి మృతిచెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన భీమిలి బీచ్‌రోడ్డులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ వాళ్లె నాగేశ్వరరావు, లక్ష్మి రమణమ్మ దంపతులకు పెద్ద కుమారుడు వాళ్లె సాయి గణేష్‌కుమార్(21) విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న డెంకాడ గ్రామానికి చెందిన తెలుగు తేజస్‌తో కలిసి మంగళవారం కళాశాలకు డుమ్మాకొట్టి తన బజాజ్ డోమినర్ 400 సీసీ బైక్‌పై భీమునిపట్నం బీచ్‌కు వచ్చారు. కొద్దిసేపు బీచ్‌లో గడిపిన అనంతరం బీచ్‌రోడ్డులో బైక్ రైడింగ్ చేసేందుకు వెళ్లారు. చేపలుప్పాడ వరకూ వెళ్లిన వీరు తిరిగి విజయనగరం వెళ్లేందుకు యూటర్న్ తీసుకుని, వేగంగా వస్తుండగా మార్లిన్ కే రెస్టారెంట్ వద్ద మలుపులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న గణేష్ హెల్మెట్ ఎగిరిపోయి, తల డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో తీవ్రగాయాలై, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న తేజస్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గణేష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి ఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సాయి గణేష్‌కుమార్ ఇటీవల కళాశాలలో నిర్వహించి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వృద్ధిలోకి వస్తాడనుకున్న పెద్దకుమారుడు తిరిగిరాని లోకాలకు తరలిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు: డీఎస్పీ

రామభద్రపురం: గంజాయి, ఖైనీ, గుట్కా, నాటుసారా వంటి మాదక ద్రవ్యాలు నిరోధించడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా నుంచి ఎక్కువగా మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ తిరుమలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

పాడిరైతులు ఆర్థిక ప్రగతి సాధించాలి

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సహకారం సద్వినియోగం చేసుకుని ప్రతి పాడి రైతూ ఆర్థిక ప్రగతి సాధించాలని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు అన్నారు. మంగళవారం మండలంలోని వేములాపల్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి హేమ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. విజయనగరం డీఎల్‌డీఏ వైద్యుడు జగదీష్‌కుమార్, ఏడీఏ చలపతిరావు, వైద్యురాలు గనివాడ హేమ పశువులకు పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ లగుడు సూర్యనారాయణ, లగుడు శ్రీను తదితరులున్నారు.



పాడిరైతులకు మందులు అందిస్తున్న దృశ్యం

ప్రమాదాలకు నిలయంగా జామి-కొట్టాం వంతెన

జామి: మండల కేంద్రమైన జామి నుంచి శృంగవరపుకోట మండలం కొట్టాం వెళ్లే వంతెన ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రివేళల్లో చాలామంది వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్న నేపథ్యంలో అధిక లోడుతో లారీలు వెళ్లడం వల్ల వంతెన బాగా దెబ్బతింది. దీనిని ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేయించాల్సిన సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో వాహనచోదకులు నిత్యం నరకం చూస్తున్నారు.



తోటపల్లి 21ఎల్ బ్రాంచ్ కాలువపై దృష్టి పెట్టండి

రేగిడి: మండలంలో సోమరాజుపేట, తోకలవలస, లింగాలవలస, వావిలవలస గ్రామాలకు సాగునీరు అందించే తోటపల్లి రాజాం బ్రాంచ్ 21ఎల్ కాలువలో రాళ్లు పేరుకుపోవటంతో సాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల ఈ సమస్యను సోమరాజుపేట గ్రామస్థులు గ్రామదర్శినిలో అధికార్లకు మొరపెట్టుకొని ఆవేదన వ్యక్తంచేశారు. దాదాపు నాలుగు గ్రామాల్లో 1500 ఎకరాల ఆయకట్టు భూములకు ఇది సాగునీటి వనరుగా ఉంది. అయితే ఈబ్రాంచ్ కాలువలో తోకలవలస, వావిలవలస, సోమరాజుపేట దరిలో పెద్దరాళ్లు ఉండటం, కాలువ తవ్వకాల్లో వీటిని తొలగించకపోవటంతో గత కొన్నేళ్లుగా సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను వైసీపీ ప్రభుత్వంలో అడపాదడపా పనులుచేసినా మోక్షం లేదు. దీంతో ఏటా ఖరీఫ్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా తోటపల్లి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



సోమరాజుపేట సమీపంలో కాలువలో బండరాళ్లు ఉన్న దృశ్యం

అక్రమ లేఅవుట్లను తొలగించాలి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



అక్రమ లేఅవుట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల ప్రాం తంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ లేఅవుట్లను వెంటనే తొలగించా లని ఎమ్మెల్యే విజయచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళశారం ఆయన అక్ర మ లేఅవుట్లను పరిశీలించారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలా లను కాపాడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకట నా యుడు, బోను దేవిచంద్రమౌళి, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్-85ను వెనక్కి తీసుకోవాలి

పాలకొండ: ప్రభుత్వం వైద్యుల పీజీ ప్రవేశం కోసం తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీవో నెంబర్-85ను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. జీవోను వెనక్కి తీసుకుని ఇన్‌సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వైద్యుల సంఘం జిల్లా సెక్రటరీ డా.వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ డా.నితీష్, వైద్యులు కమలనాధ్, రవికుమార్, సంతోషి, సాయిచరణ్, ప్రదీప్, సత్యవేణి, సోయల్ ఉన్నారు.

గిరిజన ప్రాంతానికి మహర్దశ

గుమ్మలక్ష్మీపురం: నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం గిరిజన సంక్షేమంపై శ్రద్ధ తీసుకొని మం త్రులు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఇక ముందు డోలీలు మోత కనిపించకూడదని, గిరిజన యువతకు ఉపాధి స్కిల్ డెవలప్‌మెంట్, కొండ శిఖర గ్రామాలకు రహదారులు, గిరిజన సహకార, ట్రైకార్ సంస్థలను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. జగన్ ప్రభుత్వం గిరిజన సంక్షేమంలో వెనుకబడిందన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

పాలకొండ: పింఛన్లు పంపిణీ ఆగస్టు 1న శతశాతం పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. తన కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 7,461 పింఛనుదారులకు రూ.3.38 కోట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వీరఘట్టం: వీరఘట్టంలోని ఆర్‌సీఎం స్కూల్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ ప్రదీప్ జ్వరంతో బాధ పడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో భాగ్యరాధ, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

గరుగుబిల్లి: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్వాహకుల వేతనాలను పెంచాలని, విద్యార్థులకు అందిస్తున్న మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుల సంఘ ప్రతినిధులు పావని, గౌరమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నీటిలోనే..

● వాటర్ ట్యాంకు శుభ్రంచేసిన ప్రతిసారి గ్రంథాలయం చుట్టూ చేరుతున్న నీరు ● గృహాల్లోకి కూడా..


● ఇబ్బందులు పడుతున్న పాఠకులు, స్థానికులు



గ్రంథాలయం చుట్టూ చేరిన నీరు

పాలకొండ: పట్టణంలోని నగర పంచాయతీకి ఎదురుగా ఉన్న నీళ్లట్యాంకు ఎప్పుడు శుభ్రం చేసినా, పంపింగ్ చేసినా సమీపంలో ఉన్న గ్రంథాలయం చుట్టూ నీరు చేరుతోంది. దీంతో పాఠకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రంథాలయంతో పాటు సమీప గృహాల్లో కూడా ఈ నీరు చేరుతోంది. ఈ విషయాన్ని ఎన్నిసార్లు కమిషనర్‌కు విన్నవించినా ఫలితం లేకపోతుందని గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, పాఠకులు వాపోతున్నారు. నీరు నిలిచిపోవడంతో గ్రంథాలయం పునాదులు నానిపోయి పగుళ్లు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే చేపల బజారు ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని పాఠకులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటీఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం ఎంఈవో-1,2లు యు.వెంకటరావు, వై.సుధాకర్‌లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 117ను రద్దుచేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని కోరారు. తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రరావు, టి.రమేష్, ఉపాధ్యక్షురాలు మాదవీలత, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం

గుర్ల: ప్రతిఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. మండలంలోని కోటగండ్రేడు, కెల్ల తదితర గ్రామాల్లోగల అంగన్ వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోషకాహారం సక్రమంగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శకుంతల, రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

● ఎమ్మెల్యే జయకృష్ణ
● పాలకొండ పాలకవర్గ సమావేశం

పాలకొండ: పాలకొండ పట్టణాన్ని అందరం కలిసి అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలను పక్కనపెట్టి పాలకొండ అభివృద్ధి చేద్దామన్నారు. ముందుగా డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారు. సీతంపేట మండలంలో డంపింగ్‌యార్డుకు సంబంధించి స్థలం పరిశీలించారని, రెండు మండలాల రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటే ఆ స్థలాన్ని గుర్తిద్దామని చెప్పారు. పట్టణం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అందుకుగాను కౌన్సిలర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం పారిశుధ్య పనులకు రూ.23లక్షలు కేటాయించినందున ఈ నిధులు అన్ని వార్డుల్లోనూ పూర్తిస్థాయిలో ఖర్చు చేసి పారిశుధ్యం మెరుగుపరుద్దామని సభ్యులకు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన పాలకొండ పట్టణంలో చీకటి సమస్య లేకుండా చూడాలని ఏఈ దేవీ ప్రసాద్‌కు సూచించారు. అవసరమైతే కొత్త దీపాలు కొనుగోలు చేయాలన్నారు. నాలుగో వార్డు గారమ్మకాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందంటూ సభ్యులు కొరికాన గంగునాయుడు, దుప్పాడ పాపినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డంపింగ్‌యార్డు స్థలం లేనందున ఈ సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు సభ్యులు గంటా సంతోష్, వెలమల మన్మధరావు కోరారు. పోతులగెడ్డలో ఆక్రమణలు పెరిగిపోయామని సభ్యుడు కిల్లారి మోహన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పోతలగెడ్డలో ఆక్రమణలు పెరిగాయని సభ్యుడు కిల్లారి మోహన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణం లోని రాయుడుకోనేరు చెరువు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంకటరాయుడు కోనేరులో లీజు లేకుండా చేపల పెంపకం సరికాదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, ఉపాధ్యక్షులు పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలి

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలురు, బాలికల కళాశాలల్లో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. బాలుర కళాశాలలో 540 మందికి, బాలికల కళాశాలలో 350 మంది విద్యార్థినులకు కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ హరగోపాల్, రేణుక, ఏజీఎంవో పైల శంకరరావు, టీడీపీ నాయకులు గండి రామినాయుడు, గంటా సంతోష్, సిమ్మా రవికుమార్ పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ధ్యేయం

● అన్న క్యాంటీన్ భవన పనులకు శంకుస్థాపన

పాలకొండ: పేదల కడుపు నింపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. స్థానిక కోటదుర్గమ్మ ఆలయానికి సమీపంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కేటాయించిన భవన పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15న తొలి విడతగా ప్రధాన పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, టీడీపీ నేత పల్లా కొండలరావు, పట్టణ, మం డల అధ్యక్షులు గంటా సంతోష్, గండి రామినాయుడు, నాయకులు సుంకరి అనిల్‌దత్, వెన్నపు శ్రీనివాసరావు, అంపోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులను శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గుడ్డు దశలోనే పురుగుల నివారణ

పాచిపెంట: వేప గింజల కషాయంతో గుడ్డు దశలోనే పురుగుల నివారణ చేయవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. వేప గింజల కషాయం తయారీ విధానం, వినియోగంపై మంగళవారం మండలంలోగల అమ్మ వలసలో రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. వేప గింజల కషాయం వల్ల గులాబి రంగు కాయితలు పెరుగు నివారణ, రసం పీల్చు పురుగుల నివారణకు అవకాశం ఉందన్నారు. రసాయనాలతో అవసరం ఉండదని తెలిపారు. 5 శాతం వేప గింజల కషాయం తయారీ విధానంపై వివరించారు. ముందుగా వేప పండ్లు సేకరించి వాటిని బాగా పిసికి గింజలను వేరు చేసి ఆరబెట్టాలన్నారు. ఆరిన గింజలను పై తొక్క తీసి వాటిని నుంచి వచ్చే వేప పప్పును సేకరించాలని చెప్పారు. ఒక కిలో వేప పప్పును బాగా రుబ్బి ఒక గుడ్డ సంచిలో మూటగట్టి ఒక కర్ర సహాయంతో 10 లీటర్ల నీటిలో 12 గంటల పాటు మునిగి ఉండేటట్టు నానబెట్టి కషాయాన్ని బాగా నీటిలోకి దిగేటట్టు వడగట్టిన అనంతరం ఒక లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల కషాయాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సాలూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు మధుసూదనరావు, సాలూరు ఏవో అనురాధ, మండల వ్యవసాయాధికారి పి.తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్



పార్వతీపురంలో సిద్ధమవుతున్న అన్నక్యాంటీన్

పార్వతీపురంటౌన్: పేదవారికి తక్కువ ధరకే భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. అన్న క్యాంటీన్‌ను ఆగస్టు 15న పునః ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని బెలగాం చర్చివీధి కూడలి వద్ద గతంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను రూ.5లక్షలతో తీర్చిదిద్దుతున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

వట్టిగెడ్డ దుస్థితిపై కలెక్టర్‌కు నివేదిక

జియ్యమ్మవలస: మండలానికి జీవనాడి అయిన వట్టిగెడ్డ రిజర్వాయర్ దుస్థితి పై ఎంపీపీ బొంగు సురేష్ నేతృత్వంలో పలువురు టీడీపీ నాయకులు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు నివేదిక అందించారు. ఎంపీపీ తోపాటు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టీడీపీ నేతలు దాసరి రామారావు, సోములు మాస్టారు, బడే సత్యంనాయుడు, తిరుపతినాయుడు మంగళవారం కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. జైకా నిధులు రూ.38కోట్లు విడుదలైనప్పటికీ ఆధునీకరణకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రధాన కాలువలతో పాటు అనుబంధ కాలువల్లో పూర్తిగా పూడిక పేరుకుపోయిందని అన్నారు. ఫలితంగా 16,680 ఎకరాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పూడికతీత పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో సాగు నీరందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బృంద సభ్యులు తెలిపారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: జట్టు సంస్థ, ప్రకృతి వ్యవసాయం సంయుక్తంగా రాయగడ జమ్ము గ్రామంలోని రైతులు పువ్వల రామారావు, పువ్వల దన్ను శ్రీరాగి, చింతలపాడులోని పత్తిక హైమావతి జీడితోటల్లో అంతర పంటలను వేశారు. ఈ పంటలను డీపీఎం షన్ముఖరాజు మంగళవారం పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పోడు, మెట్టు భూముల్లో చిరు ధాన్యాలు, రాగులు, జొన్నలు, సజ్జలు, అరికలు, గంటెలు, సామలు, ఊదలు తదితరమైన వి వేసుకోవడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పెంచుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది పి.జగదీష్, ఎం.సీతారాం, కె.చిరంజీవి, పి.రామారావు, రైతులు టి.లక్ష్మి, జి.పూర్ణమ్మ, పి.ఆమని తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఎం షన్ముఖరాజు

కాంట్రాక్టర్‌పై మండిపడిన వ్యాపారులు

కురుపాం: కురుపాంలో తూనికలు, కొలతలకు సీల్ వేయడానికి ప్రభుత్వ రుసుం కాకుండా అదనంగా కాంట్రాక్టర్ డబ్బులు తీసుకోవడంపై వ్యాపారస్థులు మండిపడ్డారు. స్థానిక ఆంజనేయ కోవెలలో తూనికలు, కొలతల అధికారులు ప్రతి ఏడాదిలాగే వ్యాపారుల కాటాలు సక్రమంగా ఉన్నయా లేవా.. అని చూసి సరిచేసి పాత సీల్‌లు తీసి, కొత్త సీల్‌లు వేసే కార్యక్రమం చేపట్టారు. అయితే కాంట్రాక్టర్ శ్రీనివాస రావు అనే వ్యక్తి దీనికోసం ప్రభుత్వ రుసుం కంటే అదనంగా వంద రూపాయలు తీసుకోవడంతో వ్యాపాలు మండి పడ్డారు. దీంతో అక్కడ ఉన్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రత్నరాజుకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌కు తీసుకోవద్దని, లేకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారుల వద్ద అదనంగా తీసుకున్న డబ్బులు తిరిగి అందజేస్తామని చెప్పారు.



తునికలు, కొలతల ఇన్‌స్పెక్టర్‌కు సమస్యను తెలియజేస్తున్న వ్యాపారులు

బడితోటల నిర్వహణపై దృష్టి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో బడితోటలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పెంచిన తోటల నుంచి సేకరించిన ఆకు కూరలు, కూరగాయలను వండించి మధ్యాహ్న భోజన పథకంతో పాటు బాలింతలకు అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బడి తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావు, ప్రధానోపాధ్యాయులు బి.మాలతి, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం పాత్రుడు, సీఆర్‌పీలు బి.రామకృష్ణ, వై.యశోధ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో బడి తోటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

పక్కాగా మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని ఉప విద్యాశాఖాధికారి పాలక నారాయుడు సూచించారు. మంగళవారం సీతంపేట మండలంలో శిలగాం, కారిమానుగూడ, జగడగూడ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు.

ఇంటర్ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను ప్రిన్సిపాల్ త్రినాథ్ అందించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందిస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని గంగన్నదొరవలస, దిగువమెండంగి తదితర గ్రామాల్లో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో అధ్వాన్నంగా గ్రామాలు పేరిట ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో ఫణీంద్రకుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించారు. గ్రామాల్లో చెత్తా చెదరాలను తొలగించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.



గంగన్నదొరవలసలో పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వృద్ధురాలికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో అచేతనంగా పడి ఉన్న వృద్ధురాలిని ఎవరూ పట్టించుకోకపోవడంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన 'కనికరం లేకుండా' అనే కథనంపై వైద్యశాఖాధికారులు స్పందించారు. ఆమెకు అత్యవసర వైద్య సేవలు అందించేం దుకు చర్యలు చేపట్టారు. వృద్ధురాలిది ఏ ఊరో తెలియదని... ఆమె కుటుంబ సభ్యులు రావాల్సిందిగా కోరుతున్నామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి కోరారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

క్లుప్తంగా..

ఉత్తమ బోధనే లక్ష్యం

పార్వతీపురం టౌన్: ఉత్తమ బోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఓ ప్రయివేటు పాఠశాలలో విద్యాబోధనకు సంబంధించి శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులు సమష్టిగా పని చేయాలన్నారు.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

పాచిపెంట: పాచిపెంటలోని నూకాలమ్మ దేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లారు. ఊరేగింపులో బళ్లవేషాలను ఏర్పాటుచేశారు.

రేపు సమన్వయ కమిటీ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: చిన్న మేరంగిలోని శత్రుచర్ల విజయరామరాజు గృహంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధ్యక్షతన జరుగుతుందని టీడీపీ మండల నాయకులు పోలేరు శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

భోజన శాల ప్రారంభం

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటశాలను సర్పంచ్ బి.మహేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్.నాగభూషణరావు, హెచ్‌ఎం బి.జానకి, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సమాజ రాష్ట్ర కార్యనిర్వాహకుడిగా కృష్ణచంద్ర

రాయగడ: రాష్ట్ర గోపాలగౌడ సమాజ కార్యనిర్వాహకుడిగా కాశీపూర్ సమితి కృష్ణచంద్ర గౌడ నియమితులయ్యారు. గౌడ కులస్థుల సంక్షేమం కోసం కృష్ణచంద్ర చేస్తున్న కృషిని గుర్తించిన సమాజం ఆయనకు ఈ పదవి కట్టబెట్టింది. ఈ విషయాన్ని జిల్లా గౌడ సమాజ అధ్యక్షుడు శరత్‌చంద్ర గౌడ మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. గౌడ సమాజ సేవలను మరింతగా విస్తృతపరుస్తామని కృష్ణచంద్ర తెలిపారు. గౌడ సమాజంలోని పేద కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లల విద్యా వివాహాలకు సహకరిస్తామని చెప్పారు.

పోలీసుల రక్తదానం

రాయగడ: రక్తదానంతో ఓ నిండు జీవితానికి జీవదానం చేసినవారం అవుతామని మునిగుడ పోలీసులు అన్నారు. ఈ మేరకు వారు డొంగసరడ ఔట్‌పోస్టు వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ పలువురు పోలీసులు పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 14 యూనిట్ల రక్తం సేకరించినట్లు మునిగుడ ప్రభుత్వాసుపత్రి వైద్యులు తెలిపారు.

భార్యను హత్యచేసిన భర్త

రాయగడ: భార్యను భర్త హత్యచేసిన ఘటన రాయగడలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నెహ్రూనగర్ కాలేజీ రోడ్డులో గౌరీ అనే వ్యక్తి తన భార్య, ముగ్గురు కూమార్తెలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ముగ్గురు కుమార్తెల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న భార్యాభర్తలు ఇంటి వద్ద టిఫిన్ కొట్టు నడుపుతున్నారు. గత కొంతకాలంగా వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో గౌరీ తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఎప్పటిలాగే తాగివచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో సహనం కోల్పోయిన గౌరీ.. రాడ్డుతో భార్య తలపై మోదాడు. దీంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహానికి ఉరివేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో ఎటూ పాలుపోక పిల్లలను లేపి, మీ అమ్మ చనిపోయిందని చెప్పి గౌరీ తప్పించుకుని పారిపోయాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, హంతకుడి కోసం గాలిస్తున్నారు.

రాయగడ రచయితకు సన్మానం

ఒడిశా

రాయగడ: స్థానిక కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు డా.బాబూరావు మహంతికి గోవాలో ఆదిలీల ఫౌండేషన్‌వారు సన్మానించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎ.నారాయణ రావు అధ్యక్షతన ఈనెల 27 నుంచి 29 వరకు జరిగిన కార్యక్రమాల్లో చివరి రోజైన సోమవారం రాత్రి ముగింపు కార్యక్రమంలో బాబురావుకు గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ చాన్సలర్, అరుణాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ సురేష్‌బాబు, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు పాల్గొన్నారు. నేషనల్ భారత్ సమ్మిట్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విషయాన్ని బాబురావు ఫోన్ ద్వారా ఇక్కడి విలేకర్లకు తెలియజేశారు.